సాక్షి
కుమురం భీం
సోమవారం, 28, ఆగస్టు, 2023



బడి.. భవితకు బాసటగా
తెలంగాణ నుంచి ఇద్దరిని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక చేశారు. ఇద్దరూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులే కావడం గమనార్హం. 8లో▸



బడులపై 'విద్యుత్' భారం
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. ఒక్క కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకే రూ.1.60 లక్షల బిల్లు పెండింగ్‌లో ఉంది. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.2 /23.5
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం నుంచి సమగ్ర శిక్షణ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షురాలు స్వరూప ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈవో కార్యాలయం, కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 28, 29, 30 తేదీల్లో సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆపద సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. రెబ్బెన మండలం నంబాల గ్రామానికి చెందిన కుమ్మరి పెంటన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోవడం పార్టీకి తీరని లోటన్నారు. పెంటన్న పిల్లల భవిష్యత్తు కోసం రూ.3లక్షల ఫిక్స్‌డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచులు సోమశేఖర్, పోషమల్లు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు రాజేశ్వర్‌రావు, శ్రీధర్, చిరంజీవిగౌడ్, శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


'ఐక్యతతోనే బీసీలకు రాజ్యాధికారం'



మాట్లాడుతున్న రమేశ్

వాంకిడి(ఆసిఫాబాద్): బీసీలు ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ అన్నారు. బీసీ చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని జైత్‌పూర్, బోర్దా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బీసీలకు అన్యాయమే జరుగుతుందన్నారు. రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగోషే శంకర్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి తదితులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణకు ఐక్య పోరాటం



మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వి.రాములు పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ ప్రథమ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసేందుకు సంస్కరణల పేరిట చట్టాల్లో మార్పులు చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు మధు, రమేశ్, జిల్లా ప్రతినిధులు ముంజం శ్రీనివాస్, ఎం.ఆనందకుమార్, ఎ.లోకేష్, త్రివేణి, రాజేందర్, కృష్ణమాచారి, కార్మికులు పాల్గొన్నారు.

నత్తనడకన క్రాప్ బుకింగ్

- జిల్లాలో నెమ్మదిగా సాగుతున్న పంటల నమోదు ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న ఏఈవోలు
- 1,28,261 ఎకరాల్లో సర్వే పూర్తి

పెంచికల్‌పేట్(సిర్పూర్): పంటల దిగుబడులు అంచనా వేయడం, పంట సేకరణ, మార్కెటింగ్‌లో రైతుల ఇబ్బందులు తొలగించేందుకు ఏటా ప్రభుత్వం క్రాప్ బుకింగ్ చేపడుతోంది. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అన్నదాతలు సాగు చేస్తున్న పంటలను స్వయంగా పరిశీలించి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోంది.

అత్యధికంగా పెంచికల్‌పేట్‌లో..

జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా పత్తి పంట సాగు చేశారు. అలాగే వరి, కంది, మిరప, సోయాబీన్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. జూన్‌లోనే పత్తి విత్తనాలు విత్తుకోగా ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. పలు మండలాల్లో ఇంకా వరినాట్లు కొనసాగుతుండగా, మిరప మొక్కలు కూడా ఇప్పుడిప్పుడే నాటుకుంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఈ సీజన్‌లో మొత్తం 4,17,190 ఎకరాల్లో పంటల వివరాలు సేకరించనున్నారు. ఇప్పటికి వరకు 1,28,261 ఎకరాల్లో క్రాప్ బుకింగ్ పూర్తి చేశారు. అత్యధికంగా పెంచికల్‌పేట్ మండలంలో 80శాతం ఈ వివరాల నమోదు పూర్తయింది. అత్యల్పంగా వాంకిడిలో ఒక శాతం లోపే పూర్తికాగా.. రెబ్బెనలో 2, కెరమెరిలో 9 శాతం మాత్రమే వివరాలు సేకరించారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ రాజులనాయుడు

లెక్క.. పక్కాగా
రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను పక్కాగా లెక్కించేందుకు అధికారులు ఈ సర్వే చేపడుతున్నారు. గతంలో దిగుబడులపై సరైన అంచనాలు లేకపోవడంతో పంట మార్కెట్‌కు వచ్చిన సమయంలో అన్నదాతలు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. పత్తి, వరి కొనుగోలు ఏర్పాట్లలోనూ అధికారులకు సరైన ప్రణాళికకు అవకాశం ఉండేది కాదు. క్రాప్ బుకింగ్ తర్వాత జిల్లాలో పంటల వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నారు. దీని ద్వారా దిగుబడులపై అంచనాకు రావడంతోపాటు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, పంట ఉత్పత్తుల సేకరణకు ఆస్కారం ఏర్పడింది.

లెక్క తేలుతుంది

రైతులు సాగు చేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర అధికారులు పరిశీలిస్తున్నారు. వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నాం. సాగు వివరాల లెక్కలు పక్కాగా నమోదు చేస్తుండటంతో దిగుబడులు అంచనా వేయొచ్చు. దీంతో పంటల సేకరణ సైతం సులభతరం అవుతుంది.
– రాజులనాయుడు, ఏడీఏ

జిల్లాలో పంటల నమోదు ఇలా..

మండలం	సాగు విస్తీర్ణం	ఆన్‌లైన్ అప్‌డేట్ ఏరియా	శాతం
పెంచికల్‌పేట్	14,535	11,765	80.94
సిర్పూర్(టి)	20,431	13,222	64.72
దహెగాం	33,580	21,680	64.56
బెజ్జూర్	26,368	16,438	62.34
లింగాపూర్	21,480	8,810	41.02
సిర్పూర్(యూ)	26,077	10,055	38.56
కౌటాల	27,304	10,399	38.09
జైనూర్	30,970	8,738	28.22
చింతలమానెపల్లి	20,660	4,959	24.00
కాగజ్‌నగర్	30,733	6,279	20.43
ఆసిఫాబాద్	40,343	7,988	19.80
తిర్యాణి	25,629	4,240	16.54
కెరమెరి	30,125	2,715	9.01
రెబ్బెన	28,360	809	2.85
వాంకిడి	40,595	160	0.39

పోలింగ్ శాతం పెంచాలి

- అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ హేమంత్ బోర్కడే



జిల్లా కేంద్రంలోని నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంతోపాటు రెబ్బెన మండలం కైరిగాం, వాంకిడి మండలం ఖిరిడి, బెండర గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమో దు శిబిరాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్– 2023లో భాగంగా నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపడుతున్నట్లు తెలిపారు. బూత్‌స్థాయి అధికారులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. నూతన ఓటర్ల నమోదుతోపాటు చనిపోయినవారు, వలస వెళ్లిన వారి వివరాలను జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో కూడా ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో అర్హులైన వారు తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ రహీమొద్దీన్, డీటీ పోచయ్య, సూపర్‌వైజర్లు, బూత్‌స్థాయి అధికారులు ఉన్నారు.

భగీరథ.. కార్మికులకు వ్యథ



కెరమెరిలో నిరసన తెలుపుతున్న భగీరథ కార్మికులు (ఫైల్)

- వేతనాలు చెల్లించడంలో ఏజెన్సీల నిర్లక్ష్యం
- మూడు నెలల జీతాలు పెండింగ్‌లోనే..
- ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణకు అవస్థలు
- సెప్టెంబర్ 2 నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 800 మంది కార్మికులు

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రజలకు నేరుగా ఇంటింటికీ శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 2015లో మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. పథకం ఉద్దేశం బాగానే ఉన్నా సంబంధిత ఏజెన్సీలు 'భగీరథ'లో పనిచేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించడం లేదు. ఉమ్మడి జిల్లాలోని 21 మండలాల్లోని కార్మికులు వారం రోజులుగా వివిధ పద్ధతుల్లో నిరసన తెలుపుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని సెప్టెంబర్ 2 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు ఆ సంఘం నాయకులు ఇప్పటికే ప్రకటించారు.

చెల్లింపుల్లో జాప్యం..
ఉమ్మడి జిల్లాలో భగీరథ నీటి సరఫరా కోసం దాదాపు 26 వేల కిలోమీటర్ల మేర పైపులైన్లు వేశారు. నీటి సరఫరా, ట్యాంకుల నిర్వహణతోపాటు పైపులైన్ల మరమ్మతుల కోసం ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 800 మంది కార్మికులు వాల్వ్ ఆపరేటర్లు, ఫిట్టర్లు, పంపు ఆపరేటర్లు, స్టోర్ అసిస్టెంట్లు, హెల్పర్లు, ఎలక్ట్రీషియన్లు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్నారు. మొత్తం మూడు ప్రైవేట్ ఏజెన్సీ కింద వీరు తమకు కేటాయించిన విధులు నిర్వర్తిస్తున్నారు. ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండగా, ఇటీవల రెండు నెలలకు సంబంధించిన వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ చేశారు. మరో మూడు నెలలకు సంబంధించిన బకాయిలు విడుదల కావాల్సి ఉంది. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణకు వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వారికి నెలకు రూ.11,500 మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు అందినా.. అందకున్నా కార్మికులకు వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ఏజెన్సీలపైనే ఉంటుంది. అయితే ఏజెన్సీలు చెల్లింపుల్లో జాప్యం చేస్తుండటంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన డిమాండ్లు..

- కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి.
- పథకంలో కార్మికులను నేరుగా ప్రభుత్వమే నియమించాలి.
- ప్రతిఒక్కరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
- వారంతపు సెలవులు ప్రకటించాలి.
- వాల్వ్ ఆపరేటర్లకు రవాణా, ఫోన్ బిల్లులతోపాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.
- కార్మికులపై వేధింపులు ఆపాలి.
- జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి.

సకాలంలో వేతనాలు చెల్లించాలి



ఏజెన్సీలు సకాలంలో వేతనాలు చెల్లించాలి. నెలనెలా నిరసన తెలిపితేగానీ జీతాలు అందని పరిస్థితి. ఈఎస్ఐ వంటి సౌకర్యం లేకపోవడంతో అనారోగ్యం ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.లక్షల్లో ఖర్చవుతుంది. ఏజెన్సీలు బాధ్యతతో వేతనాలు చెల్లించాలి.
– లింగయ్య, ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా మిషన్ భగీరథ కార్మికుల సంఘం

పంట మార్పిడితో లాభాల బాట

- పత్తికి ప్రత్యామ్నాయం వైపు రైతుల దృష్టి
- గతంతో పోల్చితే పెరిగిన మిరప, కూరగాయల సాగు

చింతలమానెపల్లి(సిర్పూర్): పంట మార్పిడి.. సాగులో రైతులు తెగుళ్ల, నష్టాలను తగ్గించుకునేందుకు పాటించే మేలైన పద్ధతి. ఏటా ఒకే రకమైన పంటలు కాకుండా వేర్వేరు రకాలు సాగు చేస్తే దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు తరచూ చెప్పే మాట. జిల్లా రైతులు ఇప్పుడిప్పుడే పంట మార్పిడి వైపు దృష్టి సారిస్తున్నారు. పత్తి, వరి వంటి పంటలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు, కూరగాయలు, మిరప వంటి ఇతర పంటలు సాగు చేస్తున్నారు.

మిరపతో లాభాలు..
జిల్లాలో ఏటా సుమారు 4.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తే అందులో దాదాపు 3.50లక్షల ఎకరాల వరకు పత్తి సాగే ఉంటుంది. నీటి సౌకర్యం ఉన్న రైతులతోపాటు చెరువుల కింద 50 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పత్తిలో నష్టాలు ఎదురవుతుండటంతో రైతులు ఇతర పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా మిరప, జొన్న, కుసుమ, మొక్కజొన్న, కూరగాయల సాగు గణనీయంగా పెరిగింది. గతేడాది కౌటాల మండలం తాటిపల్లి, గుండాయిపేట, చింతలమానెపల్లి మండల కేంద్రంతోపాటు లంబాడిహెట్టి తదితర గ్రామాల్లో అన్నదాతలు మిరప పంటతో లాభాలు గడించారు. ఈ ఏడాది వారిని ఆదర్శంగా తీసుకున్న మరికొంత మంది మిరప సాగుకు మళ్లారు. కౌటాల మండలంలో గతేడాది 300 ఎకరాల్లో మిరప సాగు చేస్తే.. ఈ ఏడాది 1000 ఎకరాలకు పెరగడం గమనార్హం. సెప్టెంబర్ వరకు మిరప నాట్లు వేసుకునేందుకు వెసులుబాటు ఉండటంతో ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



మిరప సాగుపై రైతుకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారి(ఫైల్)

పత్తిలో వరుస నష్టాలు..

పత్తి సాగు చేసిన రైతులు కొన్నేళ్లుగా నష్టాలు ఎదురుర్కొంటున్నారు. సాగు వ్యయం పెరగడంతోపాటు కూలీల కొరత వారిని ఇబ్బందుల పాలు చేస్తోంది. అలాగే వాతావరణ మార్పులతో ఊహించని తెగుళ్లతో అధిక మొత్తంలో రసాయనిక మందుల వినియోగం పెరిగింది. ఎరువుల వినియోగమూ పెరిగింది. భూమిలో సారం తగ్గి దిగుబడులు పడిపోయాయి. పంట చేతికందినా ధరలో స్థిరత్వం లేక గతేడాది రైతులు నెలల పాటు పంటను ఇళ్లలోనే నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. చివరకు నష్టాలతోనే అమ్ముకున్నారు.

సీజన్లకు అనుగుణంగా..
సాధారణంగా రైతులు సీజన్లకు అనుగుణంగా పంట రకాలను ఎంచుకుంటారు. ఏడాదికి ఒక్క పంటను సాగు చేసే ప్రాంతాల్లో ప్రధాన పంటలను మార్పిడి చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటే మరింత ఉపయుక్తంగా ఉంటుంది. సీజన్లలో కేటగిరీలుగా స్వల్పకాలిక పంటలు సాగు చేసే రైతులు ఒక పంట అనంతరం భూమి ఉపరితలాన్ని కప్పే పంటలను సాగు చేయాలి. వరుసగా రెండు సంవత్సరాలు ఒకే పంటను సాగు చేసే వారు ఒక ఏడాది చిరుధాన్యాల సాగు చేయాలని సూచిస్తున్నారు. చిరుధాన్యాల సాగుతో భూమి సారవంతంగా మారేందుకు అవకాశం ఉంటుంది. వరి సాగు తర్వాత మినుము, శనగ, చెరుకు సాగు చేయడం ద్వారా సుడిదోమ, ఇతర తెగుళ్లను అరికట్టవచ్చు. పంట మార్పిడితో రైతులతోపాటు నేలలు సారవంతమయ్యేందుకు ఉపయోగపడుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం

సీజన్లను అనుసరించి రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పిస్తున్నాం. ఉపయోగాలను వివరిస్తున్నాం. రైతులు ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈవోల ద్వారా సమాచారం తెలుసుకోవచ్చు. సాగులో అనుమానాలు ఉంటే వారి సూచనలు తీసుకోవచ్చు.
– రాజులనాయుడు, ఏడీఏ

ఓటరుగా నమోదు చేసుకోవాలి



వసతులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

జైనూర్(ఆసిఫాబాద్): జైనూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అదనపు కలెక్టర్ దాసరి వేణు పర్యటించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. అనంతరం గూడమామడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. తహసీల్దార్ హైమద్‌ఖాన్, ఆర్ఐ సుధాకర్ వాగ్మారే, ఎంపీటీసీ జుగాదిరావు, సర్పంచ్ కేశవ్ తదితరులు ఉన్నారు.

చెస్‌తో మేధాశక్తి పెంపొందుతుంది

- మంచిర్యాల అదనపు కలెక్టర్ బి.రాహుల్



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలటౌన్: చెస్‌తో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటి ఉన్నత పాఠశాలలో ఆదివారం మంచిర్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. చెస్‌తో చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బిజ్జు, చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ సిరాజ్ ఉర్ రెహమాన్, ఉమ్మడి జిల్లా చైర్మన్ ఈగ కనకయ్య, ఆసిఫాబాద్ అధ్యక్షుడు కోట సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న డీఆర్‌వో సురేశ్

నార్నూర్: గాదిగూడ, నార్నూర్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం డీఆర్‌వో సురేశ్ పరిశీలించారు. తహసీల్దార్లను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ 13, 14, 15, 16, నార్నూర్‌లోని 1, 4, మహాగావ్‌లోని 18 పోలింగ్ కేంద్రాలు, గాదిగూడ మండలంలోని ఖడ్కీ, లోకారి(కె), అంద్‌గూడ, పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్లు రాజలింగం, విజయనందం, డీటీలు అమృత్‌లాల్, యాదవ్‌రావు, కవిత, నీల, శకుంతల ఉన్నారు.

'బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మహారాష్ట్రలోని గడ్చిరోలి ఎమ్మెల్యే దేవ్‌రావు హోలీ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన ముగింపులో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ విధానాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఓట్ల కోసం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జిల్లాలోని ప్రాజెక్టుల కింద తొమ్మిదేళ్లుగా ఒక్క ఎకరానికి సైతం సాగునీరందించడం లేదని ధ్వజమెత్తారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకర్గాల్లో ఒక్కరికీ కూడా డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు రైతులకు న్యాయం చేస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణకుమారి, ఆత్మారాంనాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొట్నాక విజయ్, మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోదావరిలో దూకి విద్యార్థి ఆత్మహత్య


అజిత్‌కుమార్(ఫైల్)

దండేపల్లి: మానసికస్థితి బాగో లేక, ఇంటర్ విద్యార్థి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గూడెం గోదావరి నది వద్ద చోటు చేసుకుంది. ఎస్సై కుందారపు ప్రసాద్ కథనం ప్రకారం.. జైపూర్ మండలం నర్వ గ్రామానికి చెందిన దూట అజిత్‌కుమార్ (17) మంచిర్యాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తన మిత్రుడు పుట్టిన రోజుకు వెళ్తున్నానని చెప్పి శనివారం ఇంటి నుంచి బైక్‌పై వెళ్లాడు. రాత్రి వరకు రాకపోవడంతో తండ్రి బానయ్య ఫోన్ చేసి ఎప్పుడస్తవ్ అని అడిగితే వస్తానని చెప్పి రాలేదు. ఆదివారం ఉదయం ఇంటికి ఫోన్ చేసి నేను ఇంటికి రావడం లేదు. నేను చనిపోతున్నానని చెప్పాడు. దీంతో వెంటనే అతని ఆచూకీ కోసం వెతకగా దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వద్ద బైక్ కనిపించింది. ఈతగాళ్ల సాయంతో నదిలో వెతకగా అజిత్‌కుమార్ మృతదేహం లభించింది. మానసికస్థితి బాగా లేకపోవడంతో నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి బానయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కోడిగుడ్ల వ్యాన్



రెబ్బెన(ఆసిఫాబాద్): మండలకేంద్రంలోని జర్నలిస్టు కాలనీ వద్ద ఆదివారం ఉదయం జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌పైకి కోడిగుడ్ల వ్యాన్ దూసుకెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి..బెల్లంపల్లి వైపు నుంచి రెబ్బెన వైపు కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న ఐచర్ వ్యాన్ ఒక్కసారిగా డివైడర్ పైకి దూసుకెళ్లడంతో ఇనుప గ్రిల్స్ ధ్వంసమయ్యాయి. అయితే ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. మరో వ్యాన్‌లో కోడిగుడ్లను లోడ్ చేసి గమ్యస్థానానికి తరలించారు. ఈ విషయమై సీఐ అల్లం నరేందర్‌ను వివరణ కోరగా ప్రమాదంపై ఎలాంటి పిర్యాదు అందలేదన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు


రాజం (ఫైల్)

మంచిర్యాలక్రైం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు అదృశ్యమయ్యాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మందమర్రికి చెందిన సింది రాజం(70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు ఈనెల 23న మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం సాయంత్రం రాజం వద్ద ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లాడు. అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా దొరకకపోవడంతో రాజం కుమారుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బడి.. భవితకు బాసటగా

- విద్యార్థుల సంఖ్య పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు
- స్వచ్ఛంద సంస్థల సహకారం.. సొంతంగా పనులు
- సాంకేతికత సాయంతో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన
- మూతబడే స్థితి నుంచి.. నో అడ్మిషన్ స్థాయికి..
- పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దిన రెబ్బన్‌పల్లి, నిపాని హెచ్‌ఎంలు
- వారి శ్రమకు జాతీయస్థాయి గుర్తింపు
- ఉత్తమ ఉపాధ్యాయులుగా అర్చన, సంతోష్‌కుమార్

విద్యార్థుల భవితను తల్లిదండ్రుల తర్వాత తీర్చిదిద్దేది గురువులే. ఉత్తమ ఉపాధ్యాయుడి చేతిలో పడిన విద్యార్థి భవిష్యత్ ఉజ్వలమే. ప్రాథమిక స్థాయిలోనే చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందిస్తూ.. వారిలో సృజనాత్మకత వెలికితీస్తూ రాణించేలా చొరవ చూపుతారు. వ్యక్తిగత శ్రద్ధ, పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం.. ఎంతో మంది గురువులను ఉత్తమంగా నిలబెడుతుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నుగూరి అర్చన, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బెడోద్కర్ సంతోష్‌కుమార్ కూడా ఇదే బాటలో పయనిస్తున్నారు. సాంకేతికత అందిపుచ్చుకుని స్వచ్ఛంద సంస్థల సహకారం.. వ్యక్తిగత శ్రద్ధతో తాము పనిచేస్తున్న పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దారు. ప్రైవేటుకు దీటుగా ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని విద్యాబోధన చేస్తున్నారు. ఒక దశలో మూతపడే స్థాయికి చేరిన పాఠశాలలను.. నో అడ్మిషన్ స్థాయికి చేర్చారు. వీరి శ్రమకు ఇప్పటికే అనేక పురస్కారాలు దాసోహమయ్యాయి. తాజాగా జాతీయ ఉత్తమ పురస్కారం సైతం వీరిని వరించింది. తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా ఇద్దరూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులే కావడం గమనార్హం. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు వీరు. – దండేపల్లి/తాంసి


విద్యార్థులకు బోధనలో భాగంగా ఫీల్డ్ ట్రిప్‌నకు తీసుకెళ్లిన అర్చన

34నుంచి 200 వరకు చేరిన విద్యార్థుల సంఖ్య

2000 సంవత్సరం నవంబర్‌లో డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించిన అర్చన 2013లో దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చింది. ఆ సమయంలో పాఠశాలలో విద్యార్థులు 34 మంది మాత్రమే ఉన్నారు. గ్రామానికి చెందిన సంగనభట్ల రాజేంద్రప్రసాద్, వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలో వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు కూర్చునేందుకు డ్యూయల్ డెస్క్ బెంచీలు, డిజిటల్ తరగతులు, తాగునీటి కోసం శుద్ధజల ప్లాంటు, కంప్యూటర్ తరగతులు, తదితర వసతులు కల్పించారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల తల్లిదండ్రుల దృష్టి ఈ పాఠశాలపై పడడంతో విద్యార్థులను చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో 2018 నుంచి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 200కు చేరుకుంది. ప్రస్తుతం పాఠశాలలో అడ్మిషన్ పొందేందుకు తీవ్ర పోటీ ఉంటోంది.

పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలు

పాఠశాల అభివృద్ధికి ప్రతినెల సొంతగా రూ.30 వేలు ఖర్చు చేస్తోంది. సమీప గ్రామాల నుంచి వచ్చే గిరిజన విద్యార్థులకు ఆటోచార్జీలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ప్రైవేటుగా ఉపాధ్యాయులను నియమించి వేతనాలు తానే చెల్లిస్తున్నారు. విద్యార్థులకు ఫీల్డ్‌ట్రిప్ నిర్వహించడం, వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కరాటేలో శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు. ఆమె చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం 2018లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా 2019లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా 2023లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.

సంతోషంగా ఉంది



దాతల సహకారం, తోటి ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అవార్డులు అందుకున్నా. వాటన్నింటికంటే భిన్నంగా ఈసారి జాతీయ స్థాయికి ఎంపిక కావడం, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకునే అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది.
– నుగూరి అర్చన, హెచ్‌ఎం, రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల, దండేపల్లి, మంచిర్యాల


డిజిటల్ తెరపై పాఠాలను బోధిస్తున్న హెచ్‌ఎం సంతోష్ కుమార్

అధునాతన బోధనతో..

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న బెడోద్కర్ సంతోష్‌కుమార్ పాఠశాలలో నూతన సాంకేతికత పద్ధతులతో విద్యాబోధన చేస్తున్నారు. డిజిటల్ తరగతులు, ప్రత్యేక యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ప్రత్యేకంగా గూగుల్ క్లాస్ రూమ్ యాప్ సాయంతో యూట్యూబ్ ఛానల్ పెట్టారు. దీనిద్వారా విద్యార్థులకు నిత్యం ఆన్‌లైన్ ద్వారా తరగతులు బోధించాడు. నిత్యం తరగతి గదిలో బోధించే పాఠ్యాంశాలను రోజు వారీగా యూట్యూబ్‌లో వీడియోలను చేర్చేవారు. పాఠశాలలో బోధించిన పాఠాలను విద్యార్థులు ఇంటివద్ద వినే అవకాశం కల్పించారు. బోధనతో పాటు ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ సైతం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు.

డిజిటల్ తరగతులు

పాఠశాలల్లోని డిజిటల్ తరగతి గదుల్లో ఉన్న పెద్ద స్క్రీన్‌పై ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే పద్ధతిలో డిజిటల్ విధానంలో పాఠాలు బోధిస్తున్నారు. దీంతో పాటు గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో అదనపు గదులు, మూత్రశాలల నిర్మాణం చేపట్టారు. డ్రాపౌట్స్ లేకుండా గ్రామస్తులకు చదువుపై అవగాహన కల్పించారు. ప్రతిభ పరీక్షల్లో సైతం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సైతం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ...వినూత్న ఆలోచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుదలకు విశేష కృషి చేస్తున్నారు. డిజిటల్ పాఠాల తయారీ, రిసోర్స్ పర్సన్‌గా తోటి ఉపాధ్యాయులకు సైతం శిక్షణ ఇచ్చారు. 2011లో బెడోద్కర్ సంతోష్‌కుమార్ పాఠశాలకు బదిలీపై వచ్చిన సమయంలో విద్యార్థుల సంఖ్య 135 ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 220కు చేరుకుంది.

అందరి కృషి ఫలితమే



జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు రావడంతో నాపై మరింత బాధ్యత పెంచింది. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు,గ్రామస్తులు అందించిన సహకారంతోనే అవార్డు వరించింది. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా.
– బెడోద్కర్ సంతోష్ కుమార్, నిపాని ప్రాథమికోన్నత పాఠశాల

రేపు ఇందిరాపార్కు వద్ద ధర్నా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ శ్రేణులు

తాండూర్: అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మంగళవారం మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మహాధర్నా సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత కార్మికులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కోడ్‌లుగా విభజించి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలిపారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. మహాధర్నాకు కార్మికులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇఫ్టూ శ్రేణులు బుచ్చన్న, శ్రీనివాస్, కుమార్, శకుంతల, మల్లీశ్వరి, మైసక్క, పోసక్క తదితరులు పాల్గొన్నారు.

జన్నారం చేరిన నేతకాని రాజకీయ చైతన్యయాత్ర


అంబేద్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

జన్నారం: అత్యధిక జనాభా కలిగిన నేతకానీలకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలని చేపట్టిన నేతకాని మహార్ రాజకీయ చైతన్యయాత్ర ఆదివారం జన్నారం చేరుకుంది. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ నేతకానీలకు రాజకీయంగా, ప్రాధాన్యత కరువైందన్నారు. ప్రభుత్వ పథకాలు, కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, నామినేట్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నేతకానీలను చైతన్యం చేయడానికి ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. యాత్ర ప్రోగ్రాం కన్వీనర్ కొత్తపెల్లి గంగేశ్, కోకన్వీనర్ జాడి రాజేశ్, నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాడి కేశవ్, నాయకులు ఆనందరావు, దిలీప్, రాజ్యవర్ధన్, లక్ష్మణ్, శివాణి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

జన్నారం: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, ఉపాధ్యాయ సంఘాల స్టీరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న కోరారు. మండల కేంద్రంలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన నూతన కంట్రిబ్యూషన్ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ కమిషన్ నియమించి ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ వేయాలని, జూలై 1 నుంచి మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి ముంజం మల్లేశ్, మండల కార్యదర్శి దుర్గం రాజలింగు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.

సమ్మె బాటలో సమగ్రశిక్ష ఉద్యోగులు


ఆసిఫాబాద్ డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల

- మూడు రోజులుగా కలెక్టరేట్ల ఎదుట ధర్నా
- అధికారులు, పోలీసులను కలిసి వినతిపత్రాలు అందజేత

ఎస్ఎస్ఏ ఉద్యోగుల వివరాలు	
ఆదిలాబాద్: 607	కుమురం భీం: 473
మంచిర్యాల: 513	నిర్మల్: 424

కెరమెరి(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించడం లేదని సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నారు. నేటి నుంచి మూడు రోజులపాటు కలెక్టరేట్ల ఎదుట ధర్నా, రిలేదీక్షలు నిర్వహించనున్నారు. మొదటి రోజు ధర్నాతోపాటు, 29, 30న 48 గంటల రిలే దీక్షలు చేపట్టనున్నారు. ఇప్పటికే జిల్లాల బాధ్యులు, పోలీస్, జిల్లా విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఉద్యోగులు ఒకేచోట చేరి, 10 గంటలకు 5 కి.మీ పాదయాత్రతో వెళ్లి కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో పాల్గొంటారు.

ఎస్పీడీ కార్యాలయం ముట్టడితో..

ఈనెల 16న రాష్ట్ర విద్యాశాఖ ఎస్పీడీ కార్యాలయం ముట్టడి విజయవంతంతో ఉద్యోగులంతా ఏకమయ్యారు. సమగ్ర శిక్షలో క్లస్టర్ స్థాయి రిసోర్స్ పర్సన్లు, ఎమ్మార్సీలో ఎంఐఎస్ కోర్డినేటర్లు, సీసీవోలు, జిల్లా కేంద్రాల్లో డీపీవో సిబ్బంది, కేజీబీవీల్లో, యూఆర్ఎస్‌లో సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు, పీటీఐ, మెసెంజర్లు, అటెండర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ తదితరులు రాష్ట్రవ్యాప్తంగా 22 వేల మంది ఉన్నారు. గత 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి సమాన పనికి సమానవేతనం చెల్లించడం లేదు. మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డితోపాటు కవితను కలిసినా పట్టించుకోవడం లేదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు వాపోతున్నారు.

ఇవి డిమాండ్లు..

- సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి
- అప్పటివరకు ఎంటీఎస్(మినిమం టైం స్కేల్) అమలు చేయాలి.
- ఉద్యోగులందరికీ 10 లక్షల జీవిత, ఆరోగ్య బీమా చెల్లించాలి
- ఎస్ఎస్ఏ మృతిచెందితే కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

ఉద్యమాలు చేపడుతాం



ఎస్ఎస్ఏ ఉద్యోగులపై ప్రభుత్వానికి శ్రద్ధలేదు. అన్ని అర్హతలున్నా రెగ్యులరైజ్ చేయాలి. తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెకు దిగుతున్నాం. పట్టించుకోకపోతే రాష్ట్రస్థాయిలో ఉద్యమాలు చేపడుతాం. – వడాల రవీందర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి

ప్రాణాలు తీసిన అతివేగం

నిర్మల్ జిల్లా సమీపంలోని జాతీయ రహదారులపై ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో అతివేగంగా దూసుకొచ్చిన లారీ మూలమలుపు వద్ద నిలిపివున్న టిప్పర్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో ఘటనలో డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి ఎదురుగా వచ్చిన లారీని ఢీకొంది. అంతటితో ఆగకుండా మరో లారీని ఢీకొనగా అదే లారీకింద వ్యాన్ డ్రైవర్ ఎగిరిపడి మృతిచెందాడు. ఈ సంఘటనలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

- రక్తమోడిన జాతీయ రహదారులు
- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత
- టిప్పర్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు
- మరో ఘటనలో డీసీఎం డ్రైవర్ మృతి


లాల్‌సింగ్ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న యువకులు

మృత్యుఒడికి ముగ్గురు..

మామడ: లారీ రూపంలో వచ్చిన మృత్యువు ముగ్గురి ప్రాణాలు కబలించింది. దీంతో ఆ గిరిజన నిరుపేద కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాలలోకి వెళ్తే... మండలంలోని పులిమడుగు గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నేరడిగొండ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కుమ్రం రాజేంద్రప్రసాద్(31), బందంరేగడి గ్రామానికి చెందిన లాల్‌సింగ్(45), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లాలోని బుద్ధ రామసముద్రంనకు చెందిన లారీ క్లీనర్ షేక్ ఖాసీం పేర(43) మృతిచెందారు.

ఎలా జరిగింది...

కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పులిమడుగు సమీపంలోని జాతీయ రహదారిపై టిప్పర్ ద్వారా మట్టితో రోడ్డు పక్కన గుంతలకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి రోడ్డు పక్కన ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో టిప్పర్ బోల్తా పడింది. టిప్పర్‌ను నడుపుతున్న లాల్‌సింగ్‌తో పాటు టిప్పర్‌లోని కుమ్రం రాజేంద్రప్రసాద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. కుమ్రం రాజేంద్రప్రసాద్ తండ్రి కుమ్రం జంగు నేరడిగొండ మండలంలోని లకంపూర్(జి) గ్రామ సర్పంచ్. రాజేంద్రప్రసాద్ జాతీయ రహదారి నిర్వహణ కంపెనీలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బందంరేగడి గ్రామానికి చెందిన లాల్‌సింగ్ కొన్ని రోజులుగా ఈ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

మూలమలుపు.. అతివేగం

ప్రమాదం జరిగిన స్థలం వద్ద మూలమలుపు ఉంది. ఆదిలాబాద్ నుంచి వచ్చే వాహనాలు ఈ గుట్ట ప్రాంతంలో 40కిలో మీటర్ల వేగంతో వెళ్లాల్సి ఉన్నప్పటికీ మూలమలుపుతో పాటు రోడ్డు పల్లంగా ఉండటంతో వేగం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రమాదంలో గాయపడిన లారీ క్లీనర్‌ను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ప్రమాద స్థలంలో లారీ

లారీలను ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

నిర్మల్‌రూరల్: అతివేగం.. ఆపై నిర్లక్ష్యం... అజాగ్రత్తగా డ్రైవింగ్ చేసి నిండుప్రాణం తీసుకున్నాడు డీసీఎం వ్యాన్ డ్రైవర్. రూరల్ ఎస్సై చంద్రమోహన్, స్థానికుల కథనం ప్రకారం..మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌కు చెందిన డీసీఎం వాహనం నిర్మల్ రూరల్ మండలం చిట్యాల బ్రిడ్జి పైన సిమెంట్ లోడుతో భైంసా వైపు వెళ్తున్న లారీని ఎదురుగా బలంగా ఢీకొట్టింది. అనంతరం కంట్రోల్ తప్పి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ సమయంలో వ్యాన్‌డ్రైవర్ మోహిత్‌పాల్ (44) రెండో లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మొదటి లారీ డ్రైవర్ షేక్ అజీజ్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు శ్రమించి బయటకు తీసుకొచ్చి జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి డీసీఎం డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యమే కారణమని పోలీసులు పేర్కొన్నారు. మోహిత్‌పాల్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కందువ జిల్లా అట్టర్ గ్రామస్తుడిగా గుర్తించారు. బ్రిడ్జిపై మూడు వాహనాలు నిలిచిపోవడంతో రెండువైపులా ట్రాఫిక్ స్తంభించింది. భైంసా, మహారాష్ట్ర వైపు వెళ్లే వాహనాలను జిల్లా కేంద్రంలోని సిద్దాపూర్ మీదుగా తరలించారు. దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు అతి కష్టం మీద ఢీకొన్న వాహనాలను పక్కకు తొలగించి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు


మోహిత్ పాల్ మృతదేహం